

# స్వరూపంలో రూపం

(గతసంచిక తరువాయి)

కథానిక

"శ్రీ"

లాడ్జికి వెళ్ళి పడుకున్నానేగాని, నిద్రపట్టలేదు. గత చరిత్రలోని ప్రస్ఫుటమైన సంఘటనలన్నీ ఒక్కొక్కటే పలుకరించ సాగినై.

ఆ దినం నేనెన్నటికీ మరిచిపోలేను. అదే తొలి సారి రాధతో నాకు పరిచయమవడం. రమారమి సంవత్సరం క్రితం 'కాలేజీ డే' నాడు ఆమె చక్కగా పాటపాడడం పాటంటే చెవికోసుకునే నేను ఆమెకు ఒక ప్రత్యేక బహుమతిని ప్రకటించడం, సభ ముగిశాక ఆమెవద్దకుపోయి అభినందించడం - ఇదేమా పరిచయానికి నాంది.

ఆ తరువాత రాధతో నాకు మైత్రి గాఢమయింది. కాలం జరుగుతున్న కొలదీ స్నేహం లోతయింది. మొదట్లో కొంతవరకు క్లాస్‌మేట్స్, సంఘం, విసిరే విసుళ్ళకు జడిసినా క్రమంగా నేను ప్రతిదినమూ సాయంత్రం ఆమెతో గడపడం పరిపాటయిపోయింది.

కాని, వింతేమిటంటే, సంవత్సరం పరిచయమున్నా ఆమె గురించి నేను తెలుసుకున్నది బహు తక్కువ. కారణం తెలుసుకోనే ఆసక్తి నాకు లేక కాదు. తనను తను కప్పిపుచ్చుకునే స్వభావం, ఆమెకు వుండీకాదు. కాని, ఆమె వ్యక్తపరిచే ప్రతి భావం, మాట్లాడే ప్రతిమాటా నాలాంటి సామాన్యులకు అర్థంకానంత సూటిగా వుండడమే. ఆమె మాటలలో, ఆమె చేతలలో మర్మం, వ్యంగ్యంలేదు. కాని, అది మనం అర్థం చేసుకోలేనంతగా మన హృదయంలోనుంచి దూసుకుపోతుంది.

నా కిదివరకే తెలుసు ఆమె మరొక వ్యక్తితో కొంత జీవితం గడిపి పరిత్యజింపబడినదని. అయితే ఆమె నన్నెందుకింత దగ్గరకు లాగుకొంది?—అనే ప్రశ్నకు నాకు సరియైన సమాధానంరాదు. బహుశా ఆమెలో అంతర్భూతమైయున్న వింత ప్రకృతే నన్ను ఆకర్షించిందేమో! ఏమయితేనేం ఆమెకు దూరమవడం కష్టమనిపిస్తూంది. ఆమెను వదులుకోలేననిపిస్తూంది.

అయితే కోరి తీసుకువచ్చిన అన్నయ్య, ఆమె కొరకు ఆత్మీయులను, అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యను, వదులుకొన్న అన్నయ్య యెందుకిలా చేశాడు? ప్రతి మనిషినీ ఆకర్షించే యీ వింత స్త్రీ అతనిలో విరక్తినెలా కలిగించ గలిగింది? ఆమెలోని సౌందర్యం, యౌవనం చెక్కుచెదరనేలేదే! ఆమె ఏవేవో చెప్పింది. కాని నాకు సరిగా అవగాహన కాలేదనే చెప్పాలి.

రఘు మా అన్నయ్యేనని రాధకు తెలియదు. తెలిస్తే ఏం? తెలిస్తే నేనుకూడా అలాంటి వాడినే అనుకుంటుందా? తెలిస్తే ఆమె హృదయంలో నాకున్న విలువ తగ్గిపోతుంది. అతడు మా అన్నయ్య అనుకుందుకు నాకే చిన్నతన మనిపిస్తుంది. ఎలాచెప్పను? ఇంతకాలం తెలియకుండా గడపలేదా? ఇకమీదట మాత్రం యెందుకు చెప్పడం?

* * *

"రాధా, అమ్మకు జ్వరం వస్తూవుంది. నన్ను చూడాలనుంది రమ్మనమని వుత్తరం వచ్చింది. ఇక వెళ్ళక తప్పదు." అన్నాను ఆపుకోలేని నిరుత్సాహంతో.

"తప్పకవెళ్లు. లేకపోతే ఆమె చాలా బాధ పడతారనుకుంటా."

"నిన్నువదలి వెళ్లాలంటే చాలా బాధగావుంది సుమా! నువ్వు నన్ను ఎందుకింత ఆకర్షిస్తున్నావు రాధా? నిన్ను ఒక్కదినం చూడకపోతే యుగ యుగాలుగానీకుదూరమైపోయినట్లుంది ఎందుచేత?"

"అయితే నిజం చెప్పు: ఎంతకాలం నన్ను వదలకుండా వుంటావ్?"

"నీవనుమతిస్తే జీవితకాలమంతా."

నేను యీజీచైరులో కూర్చున్నాను. నా ప్రక్కనే క్రిందకూర్చుని ఏదో కుట్టుకుంటూంది రాధ. ఆ సన్నని జార్జెటుచీర, బిగించి తొడిగిన పువ్వులజాకెట్టులోనుంచి తొణికిసలాడుతున్న ఆమె యౌవనలావణ్యం, వెన్నెలకు మెరుగుదిద్దే పచ్చని శరీరపుఛాయ, విశాలమైన నుదుటిపై గాలికి మెల్లగా కదలాడే ఆ నల్లని ముంగురులు, చిలిపి నవ్వులు చిలికిస్తూ కలకలలాడే ఆ కళ్ళల్లోని నిత్య నూతనకాంతులు ఎవరిని ఆకర్షించవు? ఈ ముగ్ధ మోహన సుందరాంగిని యెవరు వదులుకోగలరు?

వసంతకాలపు చల్లగాలులు, పున్నమచంద్రుని వెన్నెల వెలుగులు, ఆమెతలలోని మత్తెక్కించే మల్లెపూవుల వాసనలు, నన్ను మైమరపించాయి. నాలోని తీరని కోరికలు చెలరేగాయి. ఒక్కసారి లేచి ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశాను...ఆమె బిడియపడుతూ నానుండి మెల్లగా తప్పుకొన్నది.

"రాధా! నేను తొందరపడితే క్షమించు. ఒక దౌర్భాగ్యుడు నీలోని విలువలను గుర్తింపలేక నిన్ను జారవిడుచుకున్నాడు కాని, నేను నిన్ను స్వీకరించి పువ్వులలోపెట్టి పూజిస్తాను. అనుగ్రహించు" అన్నాను. మాటలు వ్యక్తపరచలేని హృదయావేశంతో.

"నా అసలు స్వరూపాన్ని మరిచిపోయి మాట్లాడుతున్నావు మధూ! సంఘందృష్టిలో, సామాన్యులదృష్టిలో, నేను స్త్రీ జీవితపు విలువలను పోగొట్టుకున్న పతితను, పరిత్యజితను. నన్ను స్వీకరిస్తాననడంలో నీ ఆత్మగౌరవం దెబ్బతినదూ?"

"నన్నంత సంకుచితునిగా భావిస్తున్నావా? సంఘం దృష్టిలో నీవేమైనా నా దృష్టిలో నీవొక అమూల్యగుప్తధనం. నీ జీవితంలో నాకు తెలియని దేముంది? అన్నీ తెలిసే నిన్ను ఆదరిస్తున్నాను. మర్మంలేని నీ మనస్సే నన్నింతదగ్గరకు తీసుకోగలిగిందనుకుంటాను."

"అవును మధూ. నాజీవితంలో యేవిషయమూ నీదగ్గర దాచివుంచలేదు. ఏ వ్యక్తి అయినా మర్మం విడిచి మనస్సువిప్పి వుంచగలిగిననాడే యెదుటి వ్యక్తికి నిజంగా సన్నిహితమవగలడు. రఘుకీ నాకూ యీ విషయంలోనే చెడింది. స్వార్థం ప్రతిమనిషికీ వుంటుంది. అలాగే వారికీవుంది. కాని ఆ స్వార్థాన్ని బహిర్గతంగా వుంచడానికి భయపడి దానిని కప్పిపుచ్చి దానికి మరొకస్వరూపం యివ్వాలని చూడడం నేను సహించలేను.

ఆయనకు నేనంటే ప్రాణమే. నన్ను వదలలేక పోయారు. అదొక విపరీతమైన మోహం. అది ఆయన తృప్తి, ఆనందం. కాని ఆయన కేవలం ఆ ఆనందంకొరకే నన్ను తీసుకువచ్చాననుకోలేదు. నన్నేదో వుద్ధరించారనుకున్నారు. అదే ఆయన జీవితాశయ మనుకున్నారు. వారి అభిప్రాయాలకు నేను తాళంవేయలేకపోయాను.

మోహం తీరింది. కలలు కరిగిపోయాయి. తృప్తి తగ్గి అసంతృప్తి చెలరేగింది. నిస్పృహ ఆవరించింది. అదే మమ్మల్ని వేరుచేసింది" అన్నది.

రాధ ముఖంలో ఏదో అవ్యక్తమైన విషాద భావాన్ని నాడు చూడగలిగాను. ఈమె అంతరాంతరాల్లో యెంత వేగిపోతోందో అనుకున్నాను. చక్కనిపుష్పం నవసిపోకమునుపే నేలరాలింది. తీసి జాగ్రత్తచేయడం బాటసారి కనీస ధర్మం.

నేనన్నాను—"రాధా నేను నిజంగానే నీకు విలువనిస్తున్నాను. కాని ఆ విషయం నీవే బాగా గుర్తించగలవు. నాకూ స్వార్థం లేకపోలేదు. నీవంటి సౌందర్యరాశిని అనుభవించడమే నాకున్న స్వార్థం. అదీకాక నీమీద నాకు ఒక బాధ్యత కూడా వుంది దానిని యిప్పుడు చెప్పలేను. కాని తరువాత తెలుసుకుంటావు. నీవు నిజంగా పతితవే అనుకున్నా నిన్ను దగ్గర తీయడంలో నాకొక ఆనందం వుంది" అని లేచాను.

* * *

ఇంటికివెళ్ళాక యెంతత్వరగా వద్దామనుకున్నా అమ్మ జ్వరం తగ్గేవరకూ వుండవలసివచ్చింది. ఇంటిదగ్గర వుండగానే మా పరీక్షా ఫలితాలు వచ్చాయి: నేను బి. యే., రాధ యింటరూ ప్యాస

య్యాము. అనుకోకుండానే నెలరోజులు దొర్లి పోయాయి. రైలు దిగి లాడ్జీలో సామాను పడేసి గంటలో స్నానాదులు ముగించుకొని, రాధ యింటికి వెళ్ళాను.

నేను వెళ్లేసరికి, ఆమె కుట్టుమిషనుమీద యేవో పిల్లల చొక్కాలు కుడుతూవుంది. నేనాశ్చర్య పోయాను.

"ఈ కుట్టుమిష నెవరిది రాధా? ఎవరికా చొక్కాలు?"

"కుట్టుమిషను కొత్తగాకొన్నాను. చొక్కాలు రెడీమేడ్ బట్టలషాపువారికి కుట్టియిస్తే వారు నాకు కూలి యిస్తారు. ఇది కొత్తగా ప్రారంభించిన వృత్తి."

నేను విస్తుపోయాను. ఇంతకాలంనుండి నే నెన్నడూ రాధ ఆర్థిక పరిస్థితులను తెలుసుకుందుకు ప్రయత్నించలేదు.

"అయితే యింట్లో జరగకే యీవృత్తి ప్రారంభించావా?"

"అవును. రఘు వెళ్ళిపోయేటప్పటికి, యింట్లో రెండువేలరూపాయల రొక్కమున్నది. దానితో ఇంతకాలం గడిచింది. ఇంటరు పూర్తయింది. వారు నాకు దయతో సంగీతం నేర్పించారు. అన్ని రకాల కుట్లూ నేర్పించారు. నేను శరణాలయంలో వుండగానే టైపునేర్చుకున్నాను. ఎక్కడయినా ఉద్యోగం దొరికితే వెళ్ళిపోతాను. అంతవరకూ నాకు చాతనైన యే విద్యనుపయోగించైనా కాల క్షేపం చేయగలను."

"నాతో చెప్పరాదూ? నీకు యింత యిబ్బందిగా వుంటే" అన్నాను.

"చెప్పవచ్చు. చెపితే నీ విప్వగలవు కూడా. కాని అప్పుడు డబ్బుతో నన్ను జయించగలననే అపోహ నీలో కలుగవచ్చు."

ఆమె ధోరణికి విస్తుపోయాను. రాధలో ఏదో పెద్ద మార్పుంది. ఆమె చాలా చిక్కిపోయింది. నల్లబడింది. ముఖంలో నిత్యమూ తొణికిసలాడే ఆ నవ్వు లేదు. ఆమె గుండెలో లోతుగా యేదో బాధ వుందని వ్యక్తమవుతూవుంది. నెలరోజులలో యింత మార్పా! ఏమిటి దీనికి కారణం? కాని నాకు అడగడానికి సాహసం కలగడంలేదు. ఆమెను ప్రశ్నించడానికే భయంగావుంది.

"నేను యింటికివెళ్ళేముందు చెప్పిన విషయాలు మరిచిపోయావా?"

"లేదు."

"అయితే నీవింత కష్టపడడం దేనికి? నీ బాధ్యతను తీసికొనే ఆనందం నాకివ్వలేవా?"

"ఇవ్వగలను. కాని ఆ బాధ్యతను తీసుకొనే ధైర్యం సాహసం మీకున్నవనుకోను." అమె చాలా కటువుగా అన్నదామాట. కాని అది ఆమె అపోహ అనుకున్నాను. నేను తేలికగా నవ్వుతూ— "ఇంకా నీకు సందేహం పోలేదన్నమాట. నాకా ధైర్యం వుందని నాకు నమ్మకం" అన్నాను.

"అయితే చెప్పు. రఘు, మీ అన్నయ్య అని నాకెందుకు చెప్పలేదు? అతడిదివరకు పెళ్ళికూడా చేసుకున్నాడని యెందుకు చెప్పలేదు? ఎన్నో విషయాలు నాతో మాట్లాడిన నీవు ఆ అభాగిని విషయం యెన్నడూ ముచ్చటించలేదేం? నీకు సాహసం లేకపోయింది. నాతో అతడు మీ అన్నయ్యనని చెప్పడానికి నీకు చిన్నతనమైంది. మర్మం విడిచి మనసు విప్పడం నీకు చాతగాని పనైంది ఈమాత్రపు సాహసంలేని నీవు సంఘాన్నీ ఆత్మీయులనూ యెదిరించి నన్ను సహభాగినిగా చేసుకోవాలని యెలా అనుకున్నావు? నేను ఎలా నమ్మగలను?"

నా హృదయంలో సూటిగా పొడిచినట్లయింది. లోపల దాగివున్న విషభాండాన్ని ఒక్కసారి లాగి నట్లయింది.

"క్షమించు రాధా. ఈ విషయమొక్కటే నీకు చెప్పలేకపోయాను. కాని యింటికి వెళ్ళాక నీకీ విషయం చెప్పాలనే తహతహ యెక్కువయింది. నేను నిజంగా ఆ విషయం నీకు చెప్పాలనేవచ్చాను. నన్ను మనస్ఫూర్తిగా క్షమించమని మరొకసారి కోరుతున్నాను. ఇక సంఘం, దాని నెదిరించగల మనస్థైర్యాన్ని నేను సంపాదించాను. నా మాట నమ్ముతావా?" అన్నాను దీనంగా ఆమె కళ్లల్లోకి చూస్తూ.

"అయితే నా చేతిలో చేయివేసిచెప్పు మధూ-పరిత్యజితయైన ఒక స్త్రీని పరిగ్రహించడాని కెన్ని శక్తులు యెదురైనా వాటికి తట్టుకోగలనని, మనస్ఫూర్తిగా నాతో వాగ్దానం చెయ్యి."

నేను చేతిలో చేయివేశాను. ఆమె తృప్తి చెందినట్లనిపించింది.

"అయితే నీకీ విషయం యెలా తెలిసింది రాధా?" అన్నాను కుతూహలం చంపుకోలేక.

"నవమణి అని నాతో శరణాలయంలో ఒక అమ్మాయి వుండేది. ఆమె నాకు చాలా దగ్గర స్నేహితురాలు. శరణాలయంలోనే వుండి ఇంటర్ వరకూ చదివి, తరువాత ట్రైనింగు ప్యాసయి యిప్పుడు శారదా నికేతనంలో పనిచేస్తూ వుంది. అక్కడ ఆమెకు మీ లతతో పరిచయమైనదట. వారిద్దరూ చాలా సన్నిహితులయ్యారు. లత తన దీన చరిత్రను నవమణికి చెప్పిందట. నవమణికి నేను రఘుతో వచ్చేసింది మొదలు యింతవరకూ జరిగిన సంఘటనలన్నీ ఎప్పటికప్పుడు వుత్తర ప్రత్యుత్తరాల ద్వారా తెలుపుతూనే వున్నాను. అందుచేత లత భర్తయే రఘునాధమని తెలుసుకుని నాకీ విషయం రాసింది. నీవు అతని తమ్ముడవని కూడా ఆమె ద్వారానే తెలిసింది" అన్నది.

"సరే, నేనింక వెళతాను" అని లేచాను.

* * *

మరొక్క 15 దినములు గడిచాయి. రోజూనే నామెను కలుసుకుంటున్నాను. ఆమెతో మామూలుగా కొంతసేపు గడుపుతూనే వున్నాను. కాని ఆమె ప్రవృత్తిలో అర్థంకాని మార్పు యేదో స్పష్టంగా కనిపిస్తుంది. ఆనాడు నేను వూరునుండి రాగానే ఆమెలో చూచిన నిగూఢ విషాద కళలనే నేనింకా చూస్తున్నాను.

ఆమె హృదయంలో యేదో బాధ నిబిడమై వుందని స్పష్టంగా తెలుస్తూంది. అయినా ఆమె మామూలుగా మాట్లాడడానికి, నవ్వడానికి ప్రయత్నిస్తూంది. కాని ఆ నవ్వులో పూర్వపు విలాసం లేదు. ఆ కళ్ళలో యేదో నిర్లిప్తత విలీనమైవుంది.

ఎన్నోసార్లు ఆమెను తరచితరచి ప్రశ్నించాను. కాని ఆమె నా ప్రశ్నను కప్పిపుచ్చుతూ ఒకనవ్వు నవ్వేసేది.

ఆ దినం నేను రాధ యింటికి వెళ్ళేసరికి రాధ సామానంతా సర్దుతూంది.

"ఇదేమిటి? ఎక్కడికీ మూటా ముల్లె?" అన్నాను.

"నా కిక్కడ విసుగుగా వుంది మధూ. కొన్ని దినాలు నవమణితో గడపాలని కోరిక కలిగింది. నీవు కూడా మీ వూరు వెళ్ళరాదూ? ఇక్కడుంటే నీ కేం తోస్తుంది?"

ఆమె హఠాత్తుగా యీ నిర్ణయాని కొచ్చిందేమో అని ఆశ్చర్యపోయాను. కాని ఆమె అలా తిరిగివస్తే కొంత మనసు కుదుటపడుతుందేమో అనుకున్నాను.

"సరే. ఎన్నాళ్ళకు తిరిగివస్తావు?" అన్నాను.

"ఒకవారం దినములలో వచ్చేస్తాను" అన్నది.

"నే నిక్కడే వుంటాను. నా కింటికి వెళ్లాలని లేదు. వారం పదిరోజుల్లో తప్పకరావాలి సుమా" అన్నాను.

మర్నాడు వుదయం నేనే స్టేషనుకు దిగబెట్టాను.

రాధ వెళ్ళిన వారం దినాలకు ఆమె దగ్గర నుండి ఒక ఉత్తరం వచ్చింది. తరుగులేని ఆశలతో తెరపిలేని కోరికలతో వుత్తరం ఆత్రంగా చింపి చూశాను.

"ప్రియమైన మధుకు,

ఈ వుత్తరానికి బదులు నేనే వస్తానని యెదురు చూస్తుండి వుంటావు. కాని నానిశ్చయం మారిపోయింది. నా జీవితలక్ష్యమే మారిపోయింది. నేను తిరిగి రాదలుచుకోలేదు. నన్ను పెంచి పెద్ద చేసిన శరణాలయమే నన్ను రమ్మని కోరింది. అక్కడ కుట్టుపని, సంగీతం వచ్చిన ఉపాధ్యాయిని కావాలని ప్రకటించారు. దానికి అప్లికేషను పెట్టాను. దానికి నాకు అర్హత లభించింది. కనుక నేనక్కడికే వెళ్ళిపోతున్నాను.

స్వేచ్ఛ స్వేచ్ఛ అని కలలుకని జీవితాన్ని అనుభవంతో కొలవాలని ప్రయత్నించాను. కాని అనుభవం వేరు. ఆనందం వేరు. ఆశయంవేరు. ఆశ్రయంవేరు. రూపం వేరు. స్వరూపంవేరు—అని అర్థంచేసుకున్నాను. నేను పొందగోరిన ఆనందమే జీవితంలో సత్యంకాదు. అంతకుమించిన సత్యము, శివము, సుందరమూ అయిన ప్రకృతి సృష్టిలో అంతటా వున్నది అనే విషయాన్ని గ్రహించాను.

మధూ! నీవు నన్ను పొందగోరావు. కారణం నారూపం ఆస్వాదించగోరి అన్నావు. పలితమైన

నన్నుద్ధరించడం నీ బాధ్యత అన్నావు. అది నీ కనీసధర్మమని భావించావు. దానికి యే శక్తులు అడ్డుపడినా యెదురీదగలనని వాగ్దానం చేశావు.

మన స్నేహం, మైత్రి, నీకు నాయందుగల అపూర్వానురాగం పురస్కరించుకొని నేను మన స్ఫూర్తిగా నిన్నొకటి అర్థిస్తున్నాను. నాయందు నీకున్న విలువలన్నిటిని కూడగట్టి నీవు నాకోరిక నెరవేర్చాలని కోరుతున్నాను.

లత భర్తృపరిత్యాగిని. కాని ఆమె పతితకాదు; నిష్కళంక. నీకున్న సదాశయాలతో చిత్తశుద్ధితో ఆమెను నీవు స్వీకరించగలవు. నీవుకాక మరెవ్వరూ ఆమెను ఉద్ధరించలేరు.

ఇక ఆమెకు అందం లేదంటావు. కాని అందమనేది కనుచూపుచేత మాత్రం కొలువ గలిగినది కాదు. భగవద్విరచితమైన సృష్టిలో సౌందర్య రహితమైన వస్తువేదీ లేదు. బాహ్య సౌందర్యం లేని ప్రతి వస్తువులోను సౌందర్యమనేది అంతర్భూతమై వుంటుంది. మనకు కనుపించేది వస్తువు యొక్క స్వరూపంమాత్రమే. మనం కనుగొనవలసింది దాని రూపం. అందమెక్కడుంటుందని అనుకోవడం వెర్రితనం. కాని దానినెలా కనుగొనాలి? అనేదే నీవు చేయవలసిన కృషి. ప్రకృతిలో ప్రతి అణువణువునా దాగియున్న సౌందర్యాన్ని పట్టి వెతికి, అనుభవించడమే సమర్థుడైన వ్యక్తి చేయవలసిన పని.

లత నీ కన్నివిధాలా ఆనందం కూర్చగలదనే నమ్మకం నాకున్నది. లతనుకూడా ఆమె అభిప్రాయం అడిగాను. ఆమె మీ అన్నయ్య యింకా తిరిగి వస్తారేమోననే ఆశవున్నట్లు వ్యక్తపరిచింది. ఇందులో రఘు యీమధ్యనే నాకు వ్రాసిన జాబుకూడా పంపుతున్నాను. అది చదివితే విషయం బోధపడుతుంది.

శుభాకాంక్షలతో
నీ రాధ"

బరువెక్కిన హృదయంతో తడబడుతున్న చేతులతో ఆ వుత్తరంకూడా విప్పాను.

"అనూరాధకు,

అయాచితంగా, అనుకోకుండా యీ వుత్తరం నీకు వ్రాస్తున్నాను. నీ సహచర్యం విడిచిపెట్టి అయిదుసంవత్సరాలయింది. ఇంతకాలానికి నేను తెలుసుకొనగలిగిన సత్యాన్ని నీవేనాడో పోల్చుకున్నావు. అందుకు నా ధన్యవాదాలు.

జీవితంలో ఆనందమనేది వెదకితే దొరుకుతుం దనుకుని భ్రమసిపోయాను. అందమున్నచోటల్లా ఆనందముందని మురిసిపోయాను. చిన్నతనంలో నేను పెరిగిన వాతావరణంలో నా కానందం లేకపోయింది. మరొక క్రొత్తజీవితం సృష్టించుకున్నాను కాని అందులోని వెలితిని నీవు వెదికి నాచేతి కందించావు. ఆ జీవితంలో విరక్తికలిగి కొన్నాళ్ళు ఆశ్రమవాసం చేశాను. కాని యిక్కడా నాకు తృప్తిలేదు—శాంతిలేదు.

నాకిప్పుడర్థమైంది——ఆనందమనేది తానున్న వాతావరణంలోనే సృష్టించుకోవాలిగాని, వెదికితే దొరికేవస్తువు కాదని. అలా సృష్టించుకోవడం చాతగాని నావంటి అసమర్థులకు జీవితం నిరానందమయం.

చిన్న తనంలో పెళ్ళిచేసుకొని ఒకవ్యక్తి జీవితం పాడుచేశాను. శుష్కసిద్ధాంతాలు, ఆశయాలు, పెంచుకొని నిన్నుకూడా నిరాశ్రయను చేశాను. నా జీవితంలో నేను సాధించగలిగినదింతే.

ఆనందాలు, ఆశయాలకు అతీతమైన ఆ లోకమే నావంటి అసమర్థునికి ఆశ్రయమిస్తుంది.

——రఘునాథం"

ఉత్తరాలు చదివాక నేనెలా వున్నానో, నాలో యేమిభావాలు రగుల్కొన్నాయో వర్ణించడానికి నాకు శక్తి చాలదేమో!

* * *

అలాంటి మూడు వేసవులు గడిచిపోయాయి, పురిటిగదిలోంచి 'ఆడపిల్ల పుట్టింది' అనేమాట వినబడింది. కొంచెంసేపటికే అమ్మ—"అమ్మాయిని చూడరా వెళ్ళి"—అంది. ఒక అద్భుత విషయాన్ని సాధించానన్నట్లు విజయగర్వంతో నావైపు చూస్తూ——"అనూరాధ నక్షత్రంటండీ——అచ్చా రాధక్కాయ్ పోలికే"అని కిలకిలానవ్వింది లత.

(సమాప్తం)